దివ్య భవ్య మందిరం

2500 ఏండ్లు నిలిచి ఉండే అద్భుత ఆధ్యాత్మిక కట్టడం.. ఇనుము వాడకుండా ప్రత్యేక శిలలతో అందంగా నిర్మాణం.. ప్రపంచంలోనే మూడో అతి పెద్ద హిందూ ఆలయం.. భారతీయ సంస్కృతి, వారసత్వాలకు నిలువెత్తు రూపం... ఇవన్నీ అయోధ్యలోని భవ్య రామ మందిర వైభవాన్ని చాటిచెప్పే విశిష్టతలు. వీటి కారణంగా ఈ ఆలయ నిర్మాణం, విశేషాలపై ప్రతి ఒక్కరికీ ఆసక్తి నెలకొన్నది. ప్రపంచంలోనే అత్యంత అద్భుత నిర్మాణాల్లో ఒకటిగా చెప్పుకొంటున్న జగదానంద కారకుడి మందిర విశేషాలు తనివి తీరా చూడాల్సిందే.. నయనానందం పొందాల్సిందే!

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

నమస్తే తెలంగాణ, డిసెంబర్ 30: జగదభిరాముడి జన్మస్థానమైన అయోధ్యాపురి సర్వాంగ సుందరంగా ముస్తాబవుతున్నది. రామమందిరం ప్రారంభం, విగ్రహ ప్రాణప్రతిష్ఠకు సమయం దగ్గర పడుతుండటంతో నిర్మాణ, సుందరీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఆలయ నిర్మాణంలో వివిధ రాష్ట్రాల కళాకారులు, కార్మికులు పాలుపంచుకుంటున్నారు. దేశ, విదేశాల నుంచి ఆలయానికి, శ్రీరాముడికి విశిష్టమైన కానుకలు వస్తున్నాయి.

అంకెల్లో అయోధ్య రామ మందిరం

శంకుస్థాపన:	5.08.2020
ప్రాణ ప్రతిష్ఠ:	22.01.2024
మందిరం నిర్మాణం సంపూర్ణమయ్యేది (అంచనా):	2026
ప్రధాన ఆలయం విస్తీర్ణం:	2.77 ఎకరాలు
నిర్మాణ విస్తీర్ణం:	57,400 చదరపు అడుగులు
ఆలయం పొడవు:	360 అడుగులు

ఆలయం వెడల్పు: 235 అడుగులు	ఆలయ శిఖరం ఎత్తు: 161 అడుగులు	ప్రవేశ ద్వారాలు: 12	గర్భగుడిలో బాలరాముడి విగ్రహం ఎత్తు: 51 అంగుళాలు	భక్తులకు దర్శనం ఇచ్చే దూరం: 35 అడుగులు	రామమందిరం కాంప్లెక్స్ మొత్తం విస్తీర్ణం: 110 ఎకరాలు

ఏకకాలంలో ఎంత మంది కాంప్లెక్స్‌లో ఉండొచ్చు: 10 లక్షల మంది వరకు	రామ మందిరానికి అయిన ఖర్చు: 400 కోట్లు	కాంప్లెక్స్ నిర్మాణానికి అయ్యే ఖర్చు (అంచనా): 1,800 కోట్లు	జూన్, 2022 నాటికి ట్రస్ట్‌కు వచ్చిన విరాళాలు: 3,400 కోట్లు	

కాలి అడుగులతో కొలిచి డిజైన్..

ప్రస్తుత రామ మందిరం డిజైన్ 1989లోనే రూపుదిద్దుకున్నది. దేవాలయాల ఆకృతులను రూపొందించడంలో నిష్ణాతులైన సోమ్‌పుర కుటుంబీకులు ఈ డిజైన్‌ను అందించారు. అప్పటి వీహెచ్‌పీ అధిపతి అశోక్ సింఘాల్ విజ్ఞప్తి మేరకు, ఆయన అయోధ్యకు వెళ్లి భూమిని పరిశీలించాలని నిర్ణయించుకొన్నారు. కానీ, అక్కడి కట్టుదిట్టమైన భద్రత నడుమ అది కుదరలేదు. దీంతో ఆయన భక్తుడి వేషధారణలో లోపలికి వెళ్లి కాలి అడుగులతో ప్రాంగణాన్ని కొలిచారు. అనంతరం డిజైన్ రూపొందించారు.

2,500 ఏండ్లు నిలిచి ఉండేలా..

ప్రధాన ఆలయాన్ని ఎల్ అండ్ టీ కంపెనీ నిర్మించగా, ఉపాలయాలు, ఇతరత్రా నిర్మాణాలను టాటా కన్సల్టెన్సీ ఇంజినీర్స్ లిమిటెడ్ నిర్మిస్తున్నది. అష్టభుజి ఆకారంలో గర్భగుడి నిర్మాణం జరిగింది. రిక్టర్ స్కేల్‌పై 10 తీవ్రతతో భూకంపాలు వచ్చినా, మరే విధమైన విపత్తులు వచ్చినా కనీసం 2,500 ఏండ్లపాటు ఆలయం వాటిని తట్టుకొనేలా డిజైన్ చేసినట్టు ఆర్కిటెక్ట్ ఆశీశ్ సోంపురా తెలిపారు.

నక్షత్ర వాటిక విశేషమిదే

ఆయోధ్య ఆలయ ప్రాంగణంలో 27 నక్షత్రాలకు సూచికగా 27 మొక్కలను గతంలో నాటారు. భక్తులు తమ జన్మ నక్షత్రాన్ని, రాశిని అనుసరించి ఆయా చెట్ల కింద కూర్చొని ధ్యానం చేసుకోవడం కోసమే ఈ వాటికను ఏర్పాటు చేశారు.

115 దేశాల నీళ్లు.. మట్టి

ప్రపంచవ్యాప్తంగా ఏడు ఖండాల్లోని 115 దేశాల్లో నదులు, సముద్రాల నుంచి తీసుకొచ్చిన నీటిని, 2,587 ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన మట్టిని రామాలయ నిర్మాణంలో వినియోగించారు. వసుధైక కుటుంబం అన్న భారతీయ భావనను ప్రతిబింబించడానికే ఈ నిర్ణయం తీసుకొన్నట్టు అధికార వర్గాలు తెలిపాయి.

రామయ్యకు దర్జీలు 'బాబూలాల్ టైలర్స్'

అయోధ్యలో ఓ చిన్న టైలర్ దుకాణం (బాబూ లాల్ టైలర్స్)ను నడుపుతున్న సోదరులు భగవత్ ప్రసాద్ పహాడీ, శంకర్ లాల్ శ్రీవాస్తవ రామయ్యకు లావణ్యవస్త్రాలను తయారు చేస్తున్నారు. 3 దశాబ్దాల క్రితం శ్రీరామ జన్మభూమి పూజారి లాల్‌దాస్ శ్రీరాముడికి వస్త్రాలు కుట్టే పనిని భగవత్ ప్రసాద్ తండ్రి బాబూలాల్‌కు అప్పగించారు. అప్పటి నుంచి ఈ కుటుంబమే స్వామివారికి వస్త్రాలు సమకూరుస్తున్నది.

రామ నవమినాడు సూర్యకిరణాలు పడేలా..

ఒడిశాలోని కోణార్క్ సూర్య దేవాలయం గర్భగుడిలోని మూల విరాట్‌పై సూర్య కిరణాలు పడినట్లుగానే, రామమందిరంలోని బాల రాముడి విగ్రహంమీద శ్రీరామనవమి రోజు సూర్యకిరణాలు ప్రసరించేలా అయోధ్య ఆలయ నిర్మాణాన్ని చేపట్టినట్టు తెలుస్తున్నది.

బాల రాముడు ఎలా ఉంటాడంటే?

గర్భగుడిలో ప్రతిష్ఠించే బాల రాముడి ఎత్తు 51 అంగుళాలు. ఐదేండ్ల బాలుడి రూపంలో ఉండనున్న ఈ రామయ్య విల్లంబులు ధరించి, కమలంపై కూర్చొని ఉండనున్నట్టు సమాచారం. వాస్తవానికి ఇలాంటి విగ్రహాలను ముగ్గురు శిల్పులు వేర్వేరుగా రూపొందించారు. చివరకు ఇందులోంచి ఓ విగ్రహాన్ని ట్రస్ట్ ఓటింగ్ ద్వారా ఎంపిక చేసింది.

మూడో అతిపెద్ద ఆలయంగా..

ప్రపంచంలో మూడో అతి పెద్ద హిందూ దేవాలయంగా రామ మందిరం రూపుదిద్దుకొన్నది. ప్రస్తుతం అంకోర్‌వాట్‌లోని దేవాలయ సముదాయం ప్రపంచంలోనే అతిపెద్ద ఆలయంగా రికార్డుల్లో ఉన్నది. తర్వాతి స్థానాన్ని తమిళనాడులోని తిరుచిరాపల్లిలో ఉన్న రంగనాథ స్వామి ఆలయం ఆక్రమించింది.

ఇనుము వినియోగించకుండా..

మందిర నిర్మాణంలో నేల, గోడలు, మెట్లు, పైకప్పు.. ఇలా అంతటా రాతినే వినియోగించారు. ఎక్కడా ఇనుము, స్టీల్, సిమెంట్, కాంక్రీటును వాడలేదు. యూపీ, గుజరాత్, రాజస్థాన్ నుంచి ప్రత్యేక శిలలను తెప్పించారు. ఆలయానికి సమీపంలోని కరసేవక్‌పురంలో 30 ఏండ్ల కిందటే రాతిని చెక్కే పనులను ప్రారంభించారు. గత 30 ఏండ్లుగా దేశం నలుమూలల నుంచి సేకరించిన రెండు లక్షల ఇటుకలను ఆలయ పీఠం కోసం వాడారు.

రామయ్యకు మన హైదరాబాద్ తలుపులు

అయోధ్య రామ మందిరం ప్రధానాలయం తలుపులతో పాటు ఇతర తలుపులను నిర్మించే కాంట్రాక్ట్‌ను సికింద్రాబాద్ బోయిన్‌పల్లిలోని అనురాధ టింబర్ డిపో నిర్వాహకులు దక్కించుకొన్నారు. యాదగిరిగుట్ట ఆలయ ద్వారాలను ఈ కంపెనీ ఎంతో నాణ్యతతో తయారు చేసిన విషయం తెలిసిందే

అయోధ్యలో వాల్మీకి విమానాశ్రయం ప్రారంభం

- **ఆధునీకరించిన రైల్వే స్టేషన్‌ను ప్రారంభించిన ప్రధాని మోదీ**
- **అయోధ్యలో రూ.15 వేల కోట్ల పనులకు శంకుస్థాపనలు**

అయోధ్య : అయోధ్యలో కొత్తగా నిర్మించిన 'మహర్షి వాల్మీకి అంతర్జాతీయ విమాన శ్రయాన్ని' ప్రధాని మోదీ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ సమ్మక్క సారక్క, నాగోబా జాతరల గురించి ప్రస్తావించారు. ఆధునికరించిన అయోధ్య ధామ్ రైల్వే స్టేషన్‌ను ప్రధాని ప్రారంభించారు. ఢిల్లీ నుంచి అయోధ్యకు బయల్దేరిన తొలి విమానంలో ప్రయాణికులు హనుమాన్ చాలీసా పఠించారు. శనివారం అయోధ్యలో పర్యటించిన మోదీ దాదాపు రూ.15 వేల కోట్లకుపైగా అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. రెండు అమృత్ భారత్ రైళ్లను, ఆరు వందే భారత్ రైళ్లను ప్రారంభించారు. అయోధ్య విమానాశ్రయం నుంచి రైల్వే స్టేషన్ వరకు రోడ్ షో నిర్వహించారు.

22న రామాలయానికి రావద్దు

శ్రీరామ జన్మభూమిలో శ్రీరాముని ప్రాణ ప్రతిష్ఠ జనవరి 22న జరుగుతుందని, ఆ రోజు రామాలయానికి రావాలని నిర్ణయించుకోవవద్దని.. ఆ తర్వాత ఎప్పుడైనా రావాలని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు.ప్రతి ఒక్కరూ ఆ రోజు రాత్రి తమ ఇంట్లో దీపాలు వెలిగించాలని, దేశవ్యాప్తంగా దీపావళి జరుపుకోవాలని మోదీ పిలుపునిచ్చారు.

అమృత్ భారత్ రైలులో విద్యార్థులు, టీచర్ల ప్రయాణం

ప్రధాని మోదీ శనివారం అయోధ్యలో ప్రారంభించిన అయోధ్య-దర్భంగ అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలులో సుమారు 1,200 మంది ఉచిత సావనీర్ పాస్ హోల్డర్లు ప్రయాణించారు. వీరిలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

విమానంలో హనుమాన్ చాలీసా పారాయణ

మహర్షి వాల్మీకి అంతర్జాతీయ విమానాశ్రయంలో అడుగు పెట్టిన మొట్టమొదటి విమానంలో ప్రయాణికులు హనుమాన్ చాలీసాను పారాయణ చేశారు. ఈ విమానం శనివారం ఢిల్లీ నుంచి బయల్దేరింది. ప్రయాణికులు 'జై శ్రీరామ్' నినాదాలు చేస్తూ, విమానం ఎక్కారు.

ఛత్తీస్‌గఢ్ నుంచి సుగంధ బియ్యం

శ్రీరాముని ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో ప్రసాదంగా వినియోగించడం కోసం ఛత్తీస్‌గఢ్ నుంచి దాదాపు 300 మెట్రిక్ టన్నుల సుగంధ బియ్యాన్ని అయోధ్యకు శనివారం పంపించారు. ఛత్తీస్‌గఢ్ ప్రదేశ్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఈ బియ్యాన్ని ఆలయానికి సమర్పించింది.

శ్రీరాముడు బీజేపీ ఎన్నికల అభ్యర్థి : శివసేన

రామాలయం ప్రారంభోత్సవాన్ని బీజేపీ రాజకీయం చేస్తున్నదనే విమర్శలు వస్తున్న సంగతి తెలిసిందే. శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ శనివారం ఓ వార్తా సంస్థ అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ, ''ఇప్పుడు ఇక మిగిలిన విషయం ఒకటే, అదేమిటంటే, ఎన్నికల్లో తమ అభ్యర్థి శ్రీరాముడు అని బీజేపీ ప్రకటించడమే. శ్రీరాముడి పేరు మీద అతిగా రాజకీయాలు జరుగుతున్నాయి'' అన్నారు.

అయోధ్యలో అమృత్ భారత్ రైలుని జెండా ఊపి ప్రారంభిస్తున్న ప్రధాని మోదీ

అమెరికాలో భారత కుటుంబం అనుమానాస్పద మృతి

న్యూయార్క్: అమెరికాలో భారత సంతతికి చెందిన ఓ కుటుంబం అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. మసాచుసెట్స్ రాష్ట్రంలోని వారి ఇంట్లో గురువారం రాత్రి ఈ ఘటన జరిగింది. మృతుల్ని రాకేశ్ కమల్ (57), ఆయన భార్య టీనా (54), కుమార్తె అరియానా (18)గా గుర్తించామని నోర్‌ఫోక్ జిల్లా అటార్నీ (డీఏ) మైఖేల్ మోరిస్సే తెలిపారు. ఈ ఘటనకు 'గృహ హింస' కారణమై ఉండవచ్చని ప్రాథమిక విచారణ అనంతరం పోలీసులు చెప్పారు. రాకేశ్ మృతదేహం వద్ద తుపాకీ లభించిందని, ఈ ఘటనలో బయటి వ్యక్తుల ప్రమేయం ఉందని చెప్పేందుకు ఆధారాలు లభ్యం కాలేదని అధికార యంత్రాంగం వెల్లడించింది. రెండు రోజులుగా వారి నుంచి ఎలాంటి స్పందనా లేకపోవటంతో బంధువు ఒకరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఇంట్లోకి వెళ్లి చూస్తే అక్కడ ముగ్గురి మృతదేహాలు కనపడ్డాయి. రాకేశ్ కమల్ దంపతులు 19 వేల చదరపు అడుగుల విస్తీర్ణంతో కూడిన విలాసవంతమైన భవనాన్ని 2019లో కొనుగోలు చేశారు. ఆర్థిక సంక్షోభం కారణంగా వారి కంపెనీ 2021 తర్వాత మూతపడింది.

ఇజ్రాయెల్ దాడుల్లో 200 మంది హతం

న్యూఢిల్లీ : హమాస్ ఉగ్రవాదులపై దాడులను ఇజ్రాయెల్ మరింత ముమ్మరం చేసింది. గాజా స్ట్రిప్‌లోని ఖాన్ యూనిస్ పట్టణంపై శుక్రవారం రాత్రి ట్యాంకులు, గగనతల బాంబు దాడులతో విరుచుకుపడింది. ఈ దాడుల్లో 24 గంటల్లో దాదాపు 200 మంది మరణించారు. సెంట్రల్ గాజాలోని నుసీరట్ క్యాంప్‌పై విమానాలు వరుస బాంబు దాడులు చేశాయని మెడిక్స్, పాలస్తీనియన్ పాత్రికేయులు తెలిపారు. ఖాన్ యూనిస్ పట్టణంలోని చాలా భాగాలపై డిసెంబరులోనే ఇజ్రాయెలీ దళాలు పట్టు సాధించాయి. రక్షణ మంత్రి యెఅవ్ గల్లంట్ మాట్లాడుతూ, తమ దళాలు హమాస్ కమాండ్ సెంటర్లు, ఆయుధాల డిపోల వద్దకు చేరుకుంటున్నాయన్నారు.

గ్యాంగ్‌స్టర్ లాండా ఉగ్రవాదిగా ప్రకటన

న్యూఢిల్లీ: కెనడా కేంద్రంగా వేర్పాటువాద కార్యకలాపాలు నిర్వహిస్తున్న గ్యాంగ్‌స్టర్ లక్బీర్ సింగ్ లాండాను భారత ప్రభుత్వం ఉగ్రవాదిగా ప్రకటించింది. ఇప్పటికే దేశం నుంచి పారిపోయిన వారిలో మోస్ట్ వాంటెడ్ లిస్టులో ఉన్న లాండా (34) పంజాబ్‌లోని తర్న్ తరన్ జిల్లా హరికేకు చెందిన వాడు. ప్రస్తుతం కెనడాలోని అల్బెర్టా ప్రాంతం ఎడ్‌మాంటన్‌లో ఉంటున్న అతడు బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్ తరపున కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడని హోం శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. సీమాంతర ఉగ్రవాద కార్యక్రమాలు నిర్వహిస్తున్న సంస్థలతో లాండాకు సంబంధాలున్నాయని, గత ఏడాది మొహాలిలో గ్రనేడ్ దాడిలో ఇతనే సూత్రధారని చెప్పారు.

'లాభదాయక పదవులపై జడ్జీలే నిర్ణయించుకోవాలి'

న్యూఢిల్లీ: న్యాయమూర్తిగా తీర్పులు వెలువరించిన వారు ప్రభుత్వం కల్పించే లాభదాయక పదవులను తీసుకోవచ్చా? ఇది న్యాయ వ్యవస్థ స్వతంత్రతను దెబ్బ తీయడం కాదా? అన్న అంశంపై ఇటీవల న్యాయవర్గాల్లో విస్తృతంగా చర్చ జరుగుతున్నది. దీనిపై ఇటీవల సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా పదవీ విరమణ చేసిన జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ తన అభిప్రాయాన్ని పీటీఐతో పంచుకున్నారు. తాము ఏమి చేయాలనుకుంటున్నారో నిర్ణయించుకునే హక్కు రిటైరైన జడ్జీల మనస్సాక్షికే వదిలిపెట్టాలని అన్నారు.

కశ్మీర్‌లో తగ్గిన ఉగ్రవాద నియామకాలు

శ్రీనగర్ : జమ్ము-కశ్మీర్‌లో స్థానిక ఉగ్రవాద నియామకాలు ఈ ఏడాది 80 శాతం తగ్గినట్లు డీజీపీ ఆర్ఆర్ స్వైన్ శనివారం మీడియా సమావేశంలో వెల్లడించారు. 2023లో 22 మంది స్థానికులు మాత్రమే ఉగ్రవాద సంస్థల్లో చేరారన్నారు. జమ్ము-కశ్మీరులో 31 మంది స్థానిక ఉగ్రవాదులు క్రియాశీలంగా ఉన్నట్లు తెలిపారు. వీరిలో 27 మంది కశ్మీర్‌కు, నలుగురు జమ్ముకు చెందినవారన్నారు. 2022లో 100 మంది స్థానికులు ఉగ్రవాదంలో చేరారన్నారు. 2021 నియామకాలతో పోల్చితే 2022లో 37% తగ్గుదల కనిపించిందన్నారు.

సంచలన తీర్పులకు చిరునామా

- **ఈ ఏడాది దేశ అత్యున్నత న్యాయస్థానం కీలక తీర్పులు**
- **సామాజిక సమస్యలపై స్పందన.. భవిష్యత్తు వివాదాలకు నిర్దేశం**

న్యూఢిల్లీ, డిసెంబర్ 30: స్వలింగ వివాహం.. ఆర్టికల్ 370 ఎత్తివేత.. జల్లికట్టు.. ఇలా పలు సామాజిక, రాజకీయ అంశాలకు సంబంధించి ఘనమైన తీర్పులను వెలువరించిన ఘనతను ఈ ఏడాది సుప్రీం కోర్టు దక్కించుకుంది. పలు సంచలన తీర్పులకు 2023 సాక్షిభూతంగా నిలిచింది. 2023లో సుప్రీం కోర్టు ఇచ్చిన కొన్ని ప్రధాన తీర్పులను ఒక సారి పరిశీలిద్దాం.

నోట్ల రద్దు సబబే

నల్లధనం వెలికితీతకు 2016లో ప్రధాని నరేంద్ర మోదీ తీసుకున్న నోట్ల రద్దు నిర్ణయాన్ని సుప్రీం కోర్టు సమర్థించింది. ఈ నోట్ల రద్దుపై జారీ చేసిన నోటిఫికేషన్ చెల్లుతుందని పేర్కొంటూ 500, 1000 రూపాయల నోట్ల రద్దుపై దాఖలైన పలు పిటిషన్లపై ఐదుగురు సభ్యుల ధర్మాసనం తీర్పు చెప్పింది.

జల్లికట్టుకు అనుమతి

ఎద్దులను లొంగదీసుకునే ప్రమాదకరమైన జల్లికట్టు క్రీడకు అనుమతి ఇస్తూ తమిళనాడు ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను సుప్రీం కోర్టు మే నెలలో ఐదుగురు సభ్యుల ధర్మాసనం సమర్థించింది.

రాహుల్‌కు ఊరట

ప్రధాని మోదీపై వివాదాస్పద వ్యాఖ్యల కేసులో జైలు శిక్ష పడ్డ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి సుప్రీం కోర్టు ఊరట కలిగించింది. పరువు నష్టం కేసులో రాహుల్‌కు రెండేళ్ల శిక్షతో పాటు ఆయన పార్లమెంట్ సభ్యత్వాన్ని సైతం కోల్పోయారు. తనకు పడ్డ శిక్షను రద్దు చేయాలంటూ రాహుల్ గాంధీ దాఖలు చేసిన పిటిషన్లను కింది కోర్టు, గుజరాత్ హైకోర్టు తిరస్కరించినప్పటికీ ఈ కేసులో అతనికి పడ్డ శిక్షపై స్టే విధిస్తూ ఆగస్టు 4న సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది.



370 ఆర్టికల్ రద్దు సరైనదే

370వ అధికరణ కింద జమ్ము-కశ్మీర్‌కు కల్పించిన ప్రత్యేక హోదాను 2019లో రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా ఎత్తివేయడం సబబేనని డిసెంబర్ 11న సుప్రీం కోర్టు తీర్పు చెప్పింది. జమ్ము కశ్మీర్‌కు ప్రత్యేక హోదా అన్నది ఒక తాత్కాలిక ఏర్పాటు మాత్రమేనని, దానిని రద్దు చేసే హక్కు రాజ్యాంగం ప్రకారం సంక్రమించినదేనని ఐదుగురు సభ్యుల ధర్మాసనం తీర్పు వెలువరించింది.

2023 రౌండప్ - సుప్రీం కోర్టు తీర్పులు

స్వలింగ వివాహం చెల్లదు

స్వలింగ వివాహం చెల్లదంటూ అక్టోబర్‌లో ఐదుగురు సభ్యుల ధర్మాసనం చారిత్రక తీర్పు చెప్పింది. సుప్రీం కోర్టు చట్టానికి అర్థం చెప్పి దానిని అమలు చేయగలదే తప్ప, కొత్తగా చట్టాలు చేయలేదని, ప్రత్యేక వివాహ చట్టంలో మార్పు కేవలం పార్లమెంట్ ద్వారానే జరగాలని స్పష్టం చేసింది. స్వలింగ వివాహం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని తీర్పు చెప్పింది. వివాహం చేసుకోవడం ప్రాథమిక హక్కు కాదని పేర్కొంది.

విద్వేష ప్రసంగాలపై కేసులకు ఆదేశాలు

విద్వేషపూరిత ప్రసంగాలపై సుప్రీంకోర్ట్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది తీవ్రమైన నేరమని, దీని వల్ల దేశ లౌకిక వాదం ప్రభావితమవుతుందని తెలిపింది. శాంతి భద్రతల సమస్యలు ఏర్పడవచ్చని ఆందోళన వ్యక్తం చేసింది. విద్వేష ప్రసంగాలపై ఫిర్యాదులు రాకున్నా కేసులు నమోదు చేయాలని ఆదేశాలిచ్చింది. ఈ ఏడాది సర్వోన్నత న్యాయ స్థానం తీర్పులు గమనిస్తే అనేక ముఖ్యమైన అంశాలపై తీర్పులు వెలువరించడమే కాక, చిరకాలంగా పెండింగ్‌లో ఉన్న అనేక వివాదాలకు పరిష్కారం చూపింది. భవిష్యత్తులో ఆయా అంశాలపై వివాదాలకు తావు లేకుండా కొన్ని ప్రమాణాలను నిర్దేశించింది.

శబరిమలలో మకరవిళక్కు ఉత్సవాలు ప్రారంభం

శబరిమల: కోట్లాది మంది భక్తులు పూజించే అయ్యప్ప కొలువైన శబరిమల దేవాలయంలో శనివారం మకరవిళక్కు ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మకర జ్యోతి దర్శనం ఉత్సవాల్లో భాగంగా జనవరి 13, 14 తేదీల్లో ప్రసాద శుద్ధ క్రియ, బింబ శుద్ధ క్రియ వంటి కార్యక్రమాలను నిర్వహిస్తారు. మకర జ్యోతి దర్శనం జనవరి 15 సాయంత్రం జరుగుతుందని ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డ్ తెలిపింది. అదే రోజున సన్నిధానంలో స్వామివారికి తిరువాభరణం, దీపారాధన ఉంటాయని తెలిపింది. జనవరి 20న పూజల అనంతరం దేవాలయాన్ని మూసివేయనున్నట్లు తెలిపింది.

24 గంటల్లో 743 కరోనా కేసులు

న్యూఢిల్లీ, డిసెంబర్ 30: దేశంలో కరోనా కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. తాజాగా శుక్రవారం నుంచి శనివారం నాటికి 24 గంటల్లో 743 కొత్త కేసులు నమోదయ్యాయి. దీంతో యాక్టివ్ కేసుల సంఖ్య 3,997కు చేరింది. ఇదే సమయంలో ఈ వ్యాధి బారిన పడిన వారిలో తాజాగా ఏడుగురు మరణించారు.

మణిపూర్‌లో మళ్లీ తుపాకుల మోత

ఇంఫాల్, డిసెంబర్ 30: ఇప్పుడిప్పుడే కాస్త కుదుటపడుతున్న మణిపూర్‌లో మళ్లీ కాల్పుల ఘటన చోటు చేసుకుంది. టెంజ్‌నౌపాల్ జిల్లాలో గుర్తు తెలియని దుండగులు కొంత మంది చెట్లపొదల నుంచి పోలీసు వాహనంపై బాంబు దాడులకు తెగబడ్డారు. శనివారం మధ్యాహ్నం జరిగిన ఈ ఘటనలో పోలీస్ సిబ్బంది ఒకరు తీవ్రంగా గాయపడ్డారని తెలిసింది. అంతేగాక మోరే పట్టణంలో రెండు ఇండ్లకు దుండగులు నిప్పు పెట్టినట్లు వార్తలు వెలువడ్డాయి. మోరే పట్టణం నుంచి పోలీస్ కమాండోలు ఓ వాహనంలో వెళ్తుండగా సాయుధులైన దుండగులు బాంబు దాడులకు తెగబడ్డారు. ఇంఫాల్-మోరే రహదారిపై ఎం చాన్పో క్రాసింగ్ వద్ద ఈ దాడి జరిగిందని ప్రత్యక్ష సాక్షి ఒకరు మీడియాకు తెలిపారు. ఈ ఘటనలో గాయపడ్డ జవాన్‌ను అస్సాం రైఫిల్స్ క్యాంపునకు తరలించినట్టు పోలీస్ అధికారి ఒకరు చెప్పారు.

ఎన్నికల వేళ ఇమ్రాన్‌కు ఎదురు దెబ్బ

లాహోర్ : పాకిస్థాన్ మాజీ ప్రధాన మంత్రి, పీటీఐ పార్టీ చీఫ్ ఇమ్రాన్ ఖాన్‌కు నేషనల్ అసెంబ్లీ ఎన్నికల్లో దారుణమైన ఎదురుదెబ్బ తగిలింది. ఫిబ్రవరి 8న జరిగే ఎన్నికల్లో పోటీ చేయడం కోసం ఆయన లాహోర్, మియాన్‌వాలీల నుంచి దాఖలు చేసిన నామినేషన్లను ఎన్నికల కమిషన్ తిరస్కరించింది. ఆయన సన్నిహితుడు షా మహమూద్ ఖురేషీ దాఖలు చేసిన నామినేషన్లను, మాజీ మంత్రి హమ్మద్ అజహర్ నామినేషన్‌ను కూడా తిరస్కరించింది. అల్పమైన కారణాలను చూపి తమ నామినేషన్లను ఈసీ తిరస్కరించిందని ఇమ్రాన్, ఆయన పార్టీ ఆరోపిస్తున్నది.

న్యూట్రాన్ స్టార్స్ ఢీ కొట్టుకుంటే బంగారం

న్యూఢిల్లీ, డిసెంబర్ 30: అత్యంత విలువైన, ఆకర్షణీయమైన భార లోహాల్లో ముఖ్యమైంది బంగారం. అయితే అంతరిక్షంలో 'కిలోనోవా' ఘటన సంభవించినప్పుడు కూడా బంగారం, సహ ఇతర భార లోహ మూలకాలు పుడుతున్నాయని 'కిలోనోవా'పై పరిశోధన చేస్తున్న మాక్స్ ప్లాంక్ ఇనిస్టిట్యూట్, యూనివర్సిటీ ఆఫ్ పోట్స్‌డ్యామ్ సైంటిస్టుల బృందం పరిశోధన తెల్చింది. అత్యంత శక్తివంతమైన గామా కిరణాలు, కాస్మిక్ కిరణాలు, ఎక్స్-కిరణాలు వెలువడి అంతరిక్షంలో భార లోహ మూలకాలు ఉద్భవించడానికి కారణమవుతున్నదని అంచనా వేశారు.

క్యాన్సర్ ఔషధ ఉత్పత్తిని పెంచే మొక్క కణాలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 30: క్యాన్సర్ చికిత్సలో అత్యంత ముఖ్యమైన 'కాంప్టోథెసిన్' ఔషధం తయారీకి సంబంధించి ఐఐటీ-మద్రాస్, ఐఐటీ-మండీ సైంటిస్టుల పరిశోధనలు ఫలించాయి. ఎన్.నిమ్మోనియానా ఔషధ మొక్కల్లో 'కాంప్టోథెసిన్' అల్కలాయిడ్ ఉంటుంది. దీంతో సైంటిస్టులు అల్కలాయిడ్‌ను అధికంగా పొందే ఔషధ మొక్కల్ని ల్యాబ్‌లో కృత్రిమంగా అభివృద్ధి చేశారు. ఐఐటీ మండీ ప్రొఫెసర్ స్మితా శ్రీవాస్తవ మాట్లాడుతూ, 'నాథోపొడైట్స్ నిమ్మోనియానా మొక్క మూల కణాల్లో జీవక్రియల్ని మార్చటం ద్వారా ఇది సాధించామని చెప్పారు.

ప్రకృతి వైపరీత్యాలతో అల్లాడిన ప్రపంచం

న్యూఢిల్లీ, డిసెంబర్ 30: ఈ ఏడాది ప్రపంచమంతా ప్రకృతి విపత్తులతో పాటు, అత్యంత వేడి ఉష్ణోగ్రతలతో అల్లాడింది. ఈ ఏడాది టర్కీ-సిరియా భూకంపాలతో పాటు దక్షిణాఫ్రికాలో వరదలు, అందమైన అల్జీరియాలలో కార్చిచ్చుతో పాటు పలు దేశాలో భారీ తుపాన్లు, వరదలు, మంచు తుపానుల తాకిడికి వందలాది మంది ప్రాణాలు పోగొట్టుకోగా, వేలాది మంది నిరాశ్రయులయ్యారు. మానవాళి నిర్లక్ష్యం, తప్పులకు ఈ ఏడాది ప్రకృతి విపత్తుల రూపంలో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చిందని ప్రముఖ వాతావరణ శాస్త్రవేత్త జేమ్స్ హాన్సెన్ అన్నారు.

మందుల ప్రభావాన్ని తెలిపే 3డీ చిప్ అభివృద్ధి

న్యూఢిల్లీ: శాస్త్రవేత్తలు కొత్త మందులను అభివృద్ధి చేసినపుడు, మనుషులపై వాటి ప్రభావాన్ని తెలుసుకోవడం కోసం ముందుగా జంతువులపై ప్రయోగాలు చేస్తారు. ఇకపై ఆ అవసరం ఉండకపోవచ్చు. ఎడిన్‌బరో విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు అభివృద్ధి చేసిన 3డీ ప్రింటెడ్ పరికరం ఈ ప్రయోగాలకు ఉపయోగపడుతుంది. రోగి శరీరంలోని వివిధ అవయవాలకు ఔషధం చేరినపుడు, ఏ అవయవం ఏ విధంగా స్పందిస్తున్నదో ఈ త్రీ-డీ ప్రింటెడ్ ''బాడీ-ఆన్-చిప్'' పరికరం అనుకరించి చూపుతుంది. ఈ డివైస్ వల్ల జంతువులపై ఆ ఔషధాన్ని ప్రయోగించక్కర్లేదు.

ఎన్నికల వేళ తగ్గనున్న పెట్రోల్, డీజిల్ ధరలు!

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలకు ముందు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటున్నది. పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని భావిస్తున్నది. ఈ మేరకు కసరత్తు కూడా చేసినట్టు సమాచారం. లీటరు పెట్రోల్, డీజిల్‌పై కనీసం రూ.4 నుంచి రూ.10 వరకు తగ్గించేలా ప్రణాళికలు రచిస్తున్నది. అయితే